www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

బుధవారం
18.11.2026





హైదరాబాద్‌లో

భూముల మెగా వేలం

2లో..

నవంబర్ 25, 27 తేదీల్లో ఈ-వేలం

- టీ-హబ్‌లో ముగిసిన ప్రీ-బిడ్ సమావేశం
- ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రక్రియపై అవగాహన
- వసతులు, నిబంధనలపై అధికారుల స్పష్టత

హైదరాబాద్ మహానగర పరిధిలోని హుడా హైట్స్, నియోపొలిస్, మూసాపేట్ వంటి అత్యంత కీలక ప్రాంతాల్లో ఉన్న విలువైన ప్రభుత్వ స్థలాలను విక్రయించేందుకు హెచ్ఎండీఏ మరోసారి మెగా ఈవేలానికి సిద్ధమైంది. ఈ నెల 25, 27 తేదీల్లో నిర్వహించనున్న ఈ ఆన్‌లైన్ వేలానికి సంబంధించి రాయదుర్గంలోని టీహబ్‌లో ఏర్పాటు చేసిన ప్రీబిడ్ సమావేశం విజయవంతంగా ముగిసింది. ఈ భేటీలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో పాటు ఎంఎస్‌టీసీ, కేపీఎంజీ ప్రతినిధులు పాల్గొని భూముల విస్తీర్ణం, మౌలిక వసతులు, ఈఎండీ చెల్లింపులు, బిడ్డింగ్ నిబంధనలపై కొనుగోలుదారులకు పూర్తి స్థాయిలో స్పష్టతనిచ్చారు. పారదర్శకమైన రీతిలో ఈవేలం నిర్వహించడమే తమ లక్ష్యమని అధికారులు తెలిపారు.

కలంజ్యోతి, హైదరాబాద్



సమ్మక్క సాగర్‌కు ఎన్ఓసీ హామీ

- అనుమతుల ప్రక్రియ త్వరగా పూర్తి చేస్తాం
- నీటి నిల్వకు అనుమతి ఇవ్వాలి
- ముంపు తగ్గింపునకు తుపాకులగూడెంకు మార్పు
- ఛత్తీస్‌గఢ్‌లో ముంపు 100 ఎకరాలకు మించదు
- భూసేకరణ నిధులు చెల్లించేందుకు సిద్ధం
- మిగిలిన అనుమతులను వేగవంతం చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

3లో..

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి త్వరలోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) లభించనుంది. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటి నిల్వకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన విజ్ఞప్తిపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందించి, అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం ముంపు 100 ఎకరాలకు మించదని తేలడం, ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మాణం పూర్తయిన ఈ ప్రాజెక్టుకు ఎన్ఓసీని త్వరగా జారీ చేసి, మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఛత్తీస్‌గఢ్ సీఎంను కోరినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు.

కలంజ్యోతి, హైదరాబాద్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
బుధవారం 18.11.2026
www.kalamjyothi.com



హైదరాబాద్‌లో భూముల మెగా వేలం

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 18) : హైదరాబాద్ మహానగర పరిధిలోని అత్యంత కీలకమైన ప్రాంతాల్లోని స్థలాలను విక్రయించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సిద్ధమైంది. ఈ నెల 25, 27 తేదీల్లో నిర్వహించనున్న మెగా ఈవేలానికి సంబంధించిన సన్నాహక సమావేశం రాయదుర్గంలోని టీహబ్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో పాటు వేలం నిర్వహణ సంస్థ ఎంఎస్‌టీసీ, ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ కేపీఎంజీ ప్రతినిధులు పాల్గొన్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి చూపిస్తున్న పలువురు డెవలపర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిడ్డర్లకు స్థలాల వివరాలు, నిబంధనలను అధికారులు సమగ్రంగా వివరించారు.

ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రక్రియపై అవగాహన..

హుడా హైట్స్, నియోపొలిస్, మూసాపేట్ ప్రాంతాల్లో ఉన్న ప్లాట్లకు సంబంధించిన భౌగోళిక పరిస్థితులు, రవాణా అనుసంధానం, ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై కేపీఎంజీ ప్రతినిధులు ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఎంఎస్‌టీసీ అధికారులు ఆన్‌లైన్ వేలం ప్రక్రియలో ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, బిడ్లను ఎలా దాఖలు చేయాలనే సాంకేతిక అంశాలను విపులంగా వివరించారు.

వసతులు, నిబంధనలపై అధికారుల స్పష్టత..

ఈ సందర్భంగా బిడ్డర్లు లేవనెత్తిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. భూముల విస్తీర్ణం, ప్రాంతాల ప్రత్యేకతలు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చెల్లింపులు, ఆ తర్వాత చేపట్టే ప్రాజెక్టులకు సంబంధించిన నిబంధనలపై స్పష్టతనిచ్చారు. పారదర్శకమైన రీతిలో ఈవేలం నిర్వహించడమే తమ లక్ష్యమని అధికారులు తెలిపారు.

వేలం షెడ్యూల్ వివరాలు ఇవే..

నవంబర్ 25న హుడా హైట్స్‌లోని 8 ప్లాట్లకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేలం జరగనుంది. నవంబర్ 27న నియోపొలిస్‌లోని 4.59 ఎకరాల స్థలానికి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మూసాపేట్‌లోని 3.15 ఎకరాల స్థలానికి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు. ఈ ప్రీబిడ్ సమావేశంతో పూర్తి స్పష్టత రావడంతో కొనుగోలుదారులు, సంస్థలు పెద్ద ఎత్తున వేలంలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాయి.

రైతాంగానికి చేయూత

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ నియోజకవర్గ సాగునీటి వసతుల కల్పనకు రూ. 1కోటికి పైగా నిధులు



కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 17) : నిర్మల్ నియోజకవర్గంలో సాగునీటి సౌకర్యాలను మెరుగు పరచేందుకు కాలువల మరమ్మతులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణకు సంబంధించి నాలుగు కీలక అభివృద్ధి పనులకు రూ.1 కోటికి పైగా నిధులు మంజూరైనట్లు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఈ నెల 16న ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయం నుండి విడుదలైన ఉత్తర్వులను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ పథకాలు పూర్తయితే వివిధ గ్రామాలకు సాగునీటి సౌకర్యాలు మరింత మెరుగు పడతాయన్నారు. ఈ నిధుల ద్వారా సాగునీటి వ్యవస్థలో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, కాలువల నిర్వహణను మెరుగుపరిచి రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. సాగునీటి వనరుల పటిష్టతకు, రైతుల అవసరాలకు ప్రాధాన్యత నిస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు రైతాంగ సంక్షేమమే లక్ష్యంగా అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తూ, సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి పునరుద్ఘటించారు.



బీసీలకు రాజ్యాంగబద్ధ వాటా దక్కాలి

డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

ఛలో ఢిల్లీ గోడపత్రిక ఆవిష్కరణ

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 17) : చెన్నారావుపేట మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య అధ్యర్యంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ హలో బీసీ, ఛలో ఢిల్లీ రాంలీల మైదానంలో జరిగే బీసీల జనభేరి గోడపత్రికలను మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో బీసీలు 50 శాతానికి పైగా ఉన్నా రిజర్వేషన్లు మాత్రం సగం వాటా కూడా దక్కడం లేదని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అయినా బీసీలు యాచించే స్థాయిలోనే ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని, చాలా రాష్ట్రాల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచితే 50 శాతం పరిమితి దాటొద్దని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కొట్టివేస్తున్నారని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వాటా దక్కకపోగా అగ్రవర్ణాల రిజర్వేషన్లతో బీసీల నోటికాడి ముద్దను గుంజుకుంటూ తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీసీ కులాల లెక్కలపై రాజకీయ పార్టీల వైఖరి ఏమిటో చెప్పాలని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రశ్నావళిలో బీసీ కాలమ్ చేర్చాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ మెడలు వంచే విధంగా వచ్చే నెల డిసెంబర్ 14, 15 తేదీల్లో ఢిల్లీలోని రాంలీల మైదానంలో జరిగే బీసీల జనభేరి సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట పట్టణ కార్యదర్శి నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, చెన్నారావుపేట మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, బహుజన నాయకులు జన్ను శ్రీనివాస్ బాబు, రజక సంఘం మండల అధ్యక్షుడు సంగెం రాంచంద్రు, బీసీ నాయకులు జినుకల నవనీత్, గుర్రం రవి, ఉప్పుల బిక్షపతి, సూత్రపు సుధాకర్, ఉప్పుల వీరస్వామి, మర్రి రమేష్, గుండం విష్ణు, తడుక రాజు, బల్లె సాయిరాం గౌడ్, మెంతుల రమేష్, పోలెపెల్లి యాకాంబ్రం, కొత్తపెల్లి రాజు, గుర్రం ఐలయ్య పాల్గొన్నారు.



హామీలతో ప్రజలకు మోసం

- **గ్యారెంటీలు అమలు కాలేదు**
- **అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**
- **నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ తిమ్మాజిపేట పాండు**

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 17) : ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు, కొత్త పింఛన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ తిమ్మాజిపేట పాండు విమర్శించారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని చెప్పి ఇప్పటికీ పాత పింఛన్ మొత్తాలనే కొనసాగించడం అన్యాయమన్నారు. కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులను ప్రభుత్వం పట్టించుకోపడం లేదని, అర్హులైన వారందరికీ పెరిగిన పింఛన్లు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..

నాగర్‌కర్నూల్ పట్టణంలో గతంలో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను మూడేళ్లుగా పూర్తి చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తిమ్మాజిపేట పాండు అన్నారు. శంకుస్థాపనలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, పాడి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో పశువైద్యశాలను ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు గతంలో అమలైన రైతు బీమా పథకాన్ని నిలిపివేసి, కొత్త పేర్లతో ప్రచారం చేయడం కాకుండా రైతులకు నిజమైన భరోసా కల్పించాలని సూచించారు. ప్రజాపాలన పేరుతో ప్రచారాలు చేసుకోవడం మానేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను ఆచరణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
బుధవారం 18.11.2026
www.kalamjyothi.com



బాధిత కుటుంబానికి రజక సంఘం చేయూత

మృతురాలి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 17) : చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట గ్రామానికి చెందిన నాగపూరి వీరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతటితో ఆగకుండా, వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు.

కష్టకాలంలో అండగా నిలవడమే మానవత్వం..

ఒక కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు పలకరించే మాట, అందించే చిన్న సహాయం కూడా కొండంత ధైర్యాన్ని ఇస్తుందని నాయకులు పేర్కొన్నారు. మనిషి మనిషికి తోడుగా నిలిచినప్పుడే సమాజంలో మానవత్వం బతికుంటుందని తెలిపారు. రజక సంఘం నాయకులు చేసిన ఈ సేవా కార్యక్రమం సమాజానికి మంచి సందేశాన్ని అందించిందని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రజక సంఘం అధ్యక్షులు సంగెం రమేష్, చెన్నారావుపేట మండల అధ్యక్షులు సంగెం రామచంద్రు, ప్రధాన కార్యదర్శి ఉప్పుల వీరాస్వామి, గౌరవ అధ్యక్షులు ఉప్పుల బిక్షపతి, మండల నాయకులు బర్ల యాకయ్య, మర్రి రమేష్, దూదిగాని రమేష్ పాల్గొన్నారు.



కోపాకుల చెరువులో ఉపాధి పనులు

గ్రామ అభివృద్ధికి ఉపాధి పనులు కీలకం

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 17) : చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట గ్రామంలోని కోపాకుల చెరువులో ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ గూడ సంధ్యమహేందర్, ఉప సర్పంచ్ మధుకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూడ సంధ్యమహేందర్ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ఉపాధి హామీ పనులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా ఉపాధి హామీ పనులను ముమ్మరం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూలీలు కొలతల ప్రకారం పనులు నిర్వహిస్తూ రోజుకు సుమారు నాలుగు గంటల పాటు శ్రమించాలని సూచించారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్రా నాగరాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి భరత్ కుమార్, ఏపీఓ అరుణ, కారోబార్ రాజ్ కుమార్, మేట్ విజేందర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

సమ్మక్క సాగర్‌కు ఎన్‌ఓసీ హామీ



కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 17) : తెలంగాణలోని సమ్మక్క సాగర్ బ్యారేజీకి అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయిని కోరారు. ఈ విజ్ఞప్తిపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఎన్‌ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయిని కలిసి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు, మిగిలిన అనుమతుల ప్రక్రియలోనూ సహకరించాలని కోరారు.

ఛత్తీస్‌గఢ్‌లో ముంపు 100 ఎకరాలకు మించదు..

సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించినా, అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో పాటు 17 ఆదివాసీ గ్రామాలు, భద్రతా మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని అంచనా వేశారు. దీంతో ముంపును తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురవుతాయి. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని నివేదికలో పేర్కొన్నారు. ఈ అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9.883 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించగా, ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది.

భూసేకరణ నిధులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం..

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. పూర్తి స్థాయి నీటి మట్టం +83 మీటర్ల వద్ద ఈ బ్యారేజీ నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను వినియోగించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టు ప్రజలకు ఉపయోగపడేలా ఎన్‌ఓసీని త్వరగా జారీ చేయాలని, మిగిలిన అనుమతుల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల బలోపేతం

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- త్వరలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయం





కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 17) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఆసుపత్రి వైద్యులు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్లు, వివిధ వైద్య విభాగాల హెచ్ఓడీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వైద్య విభాగాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది వివరాలను సమీక్షించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంసీహెచ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలపై అధికారులతో చర్చించారు. ఉయ్యాలవాడలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణానికి ప్రస్తుత ఆసుపత్రిలోని కొన్ని వైద్య విభాగాలను తరలించే అంశాన్ని పరిశీలించారు. ఇందుకు అవసరమైన భవనాలు, మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకుని ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

త్వరలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయం..

జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు త్వరలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వెల్లడించారు. ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య పరీక్షలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. క్రిటికల్ కేర్ విభాగంలో అవసరమైన పరికరాలు, వైద్య సిబ్బంది, ఇతర సౌకర్యాలపై కూడా సమీక్షించారు. ఆసుపత్రిలోని అన్ని వైద్య విభాగాలను బలోపేతం చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా వైద్యాధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ, డాక్టర్ రఘు, వైద్యులు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్లు, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అండ

పేదలకు అండగా నిలవడమే మానవతా ధర్మం

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 17) : చెన్నారావుపేట మండలం అక్కల్ చెడ గ్రామానికి చెందిన సూర తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక, సామాజిక భరోసా కల్పించే దిశగా తమ వంతు సహాయాన్ని అందించారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి పంపించిన 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా నిలవడమే మానవతా ధర్మమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ జూనూతుల మహేందర్ రెడ్డి, 7వ వార్డు సభ్యులు లక్క రాజు, 8వ వార్డు సభ్యులు ఎల్ల గౌడ్, పిట్టల వెంకటేష్, సిద్ధ క్రాంతి, సంకటి చంద్రమౌళి, ఉప్పునూతుల రాజు, మర్రి మధుకర్, మరాఠీ రాజు, రంగారెడ్డి పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
బుధవారం 18.11.2026
4
www.kalamjyothi.com



నర్సంపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

- నాణ్యతతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 17) : నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం..

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ నర్సంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టణ ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నర్సంపేటను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలకంటి విజయ్ కుమార్, సలావుద్దీన్ అయూబ్ ఖాన్, శ్రీరామోజు రోజా రాణి, మున్సిపల్ సిబ్బంది బొల్లెపెల్లి శ్రావణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ములుకల మనీష్, కాంగ్రెస్ నాయకులు బొమ్మెరబోయిన ప్రేమ్ కృష్ణ, మచ్చకంటి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

420 హామీలతో ప్రజలకు మోసం

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

- మూడేళ్ల పాలనపై గొప్పలు చెప్పకోవడం విడ్డూరం
- నియోజకవర్గ అభివృద్ధి పనులకు వెంటనే నిధులు కేటాయించాలి



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 17) : ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలకు ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు మూడేళ్ల పాలన గురించి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, తులం బంగారం, రైతులకు రూ.15 వేల రైతు భరోసా, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు భృతి, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థుల సంక్షేమ హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు.

నియోజకవర్గ అభివృద్ధి పనులకు వెంటనే నిధులు కేటాయించాలి..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల పనులకు నిధులు కేటాయాలని మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది సంబరాలు చేసుకునే సమయం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాల్సిన సమయమన్నారు. ఇప్పటికైనా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



ఇందిరమ్మ బీమా దరఖాస్తుల స్వీకరణ



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

ఈ నెల 19 నుంచి దరఖాస్తులు

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 17) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి ఈ నెల 19 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు పథకం అమలుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కులం, మతం, ఆదాయ పరిమితులతో సంబంధం లేకుండా ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు వెల్లడించారు. కుటుంబంలో జీవనోపాధికి ప్రధాన ఆధారమైన వ్యక్తికి బీమా వర్తించేలా నామోదు చేయాలని, ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తున్న కుటుంబాల్లో బీమా పొందే వ్యక్తిని కుటుంబ సభ్యులే ఎంపిక చేసుకోవచ్చని సూచించారు.

ఈ నెల 19 నుంచి దరఖాస్తులు..

ఈ నెల 19 నుంచి గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు (1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు) అర్హులని, రేషన్ కార్డు ఉన్నవారితో పాటు లేని వారి వివరాలను కూడా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. బీమా పొందే వ్యక్తి ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకోవచ్చని, వారి వాటాల నిష్పత్తిని కూడా దరఖాస్తులో పేర్కొనవచ్చని వివరించారు. నమోదు చేసిన వివరాలను కుటుంబ సభ్యులకు చదివి వినిపించి సంతకాలు తీసుకోవాలని, దరఖాస్తుదారులు ఆధార్, రేషన్ కార్డులు వెంట తెచ్చుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, సీపీఓ సుజాత, డీఆర్డీఓ చిన్న ఓబులేసు, ఈడీఎం నరేష్, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



విదేశీ రాజకీయ ప్రతినిధి వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపండి

బీజేపీ రాష్ట్రనేత రావుల రామ్ నాథ్ ఆధ్వర్యంలో ఎస్పీ కి ఫిర్యాదు

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 17) : హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్ 2026లో పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్ సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్ చేసిన రాజకీయ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా నాయకులతో కలిసి జిల్లా ఎస్పీని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. భారత దేశంలో పర్యటిస్తున్న విదేశీ రాజకీయ ప్రతినిధి బహిరంగ వేదికపై "ఓట్ చోర్.. గద్దీ ఛోడ్" అనే రాజకీయ నినాదాన్ని ప్రస్తావించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు.

జియాకోమో ఫిలిబెక్ ఏ కేటగిరీ వీసాపై భారత్‌కు వచ్చారు?

వీసా నిబంధనలకు అనుగుణంగానే రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నారా? ఇందుకు సంబంధిత కేంద్ర ప్రభుత్వ అనుమతులు పొందారా? అనే అంశాలను పరిశీలించాలని కోరారు. అలాగే భారత్ సమ్మిట్ నిర్వాహకులు, స్పాన్సర్లు, సమన్వయకర్తల పాత్రపైనా విచారణ జరపాలని, ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ 2025 నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రావుల రాంనాథ్ మాట్లాడుతూ, భారతదేశ సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. విదేశీ ప్రతినిధులు భారత చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాతాలం చిన్నారెడ్డి, నిర్మల్ మున్సిపల్ కౌన్సిలర్లు గంజి రాజు, కూన శశాంక్, రామోజీ నరేష్, రావుల వార్ విఠల్, ధర్మాజీ గారి ఈశ్వర్, జిల్లా మీడియా కన్వీనర్ బుర్ర రమేష్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు కుమ్మరి వెంకటేష్, ఒడిసిల అర్జున్, ఎండోమెంట్స్ జిల్లా కన్వీనర్ కందుల హరీష్, నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
బుధవారం 18.11.2026
www.kalamjyothi.com







కంటి సమస్యలు లేని నియోజకవర్గమే లక్ష్యం

జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణాప్రతాప్ రెడ్డి

1,625 మందికి కంటి పరీక్షలు

52 మందిని ఆపరేషన్ల కోసం తరలింపు



కలంజ్యోతి, నెక్కొండ (నవంబర్ 17) : నెక్కొండ మండలంలో జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 1,625 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పేద ప్రజలకు కంటి వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో 6వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఆపరేషన్లు అవసరమైన 52 మందిని గుర్తించి తదుపరి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో కంటి వైద్యం చేయించుకోలేని పేదలకు ఈ శిబిరం ఎంతో ఊరటనిచ్చింది.

కంటి సమస్యలు ఉండొద్దు..

ఈ సందర్భంగా జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నట్లుగా అన్ని ఇంద్రియాల్లో కంటికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. నర్సంపేట నియోజకవర్గంలో ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడకూడదన్నదే తన లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు ఒక్కసారితో ఆగిపోవని స్పష్టం చేశారు. శిబిరానికి వాసవి కళ్యాణ మండపాన్ని ఉచితంగా అందించిన నెక్కొండ ఆర్యవైశ్య సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారం రాము, దొడ్డ నాగేష్, తాటిపెల్లి శివకుమార్, దొడ్డ విజయ్, తాళ్లూరి నరసింహులు, కొనిశెట్టి భిక్షపతి, నాయిని అశోక్, దామచర్ల రామారావు, అంబాల రాంగోపాల్, రాంపల్లి రాజగోపాల్, శ్రీరంగం సాగర్, అంబాల సుధీర్, పసుల అశోక్, సింగారపు సురేష్, సింగారం శ్రీరాములు, శ్రీనివాస్, నీలం ఏలేందర్, లౌడియా శ్రీనివాస్, జమ్ముల సుధాకర్, మల్లం మల్లేష్, కుడికాల సుధీర్, పోయాడ అనిల్, జయప్రకాష్, శ్రీనివాస్ గౌడ్ శెట్టి, సూత్రం శీను, రాజు, బల్లికొండ పవన్, కుడికాల శ్రీధర్, శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం, జనతా ట్రస్ట్ సభ్యులు, నెక్కొండ మండల ప్రజలు పాల్గొన్నారు.





ఘనంగా పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, నూతన ఆలయ ప్రవేశం సందర్భంగా మంగళవారం గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి గౌడ సంఘం మహిళలు ఇంటికో బోనం ఎత్తి ఘనంగా బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో సామూహికంగా ఊరేగింపుగా పోచమ్మ ఆలయం వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని తీపి, కూరగాయల వంటకాలతో బోనాలను సమర్పించుకున్నారు. తమ వృత్తిని, పాడిపంటలను, పిల్లపాపలను చల్లంగా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లిన మహిళలను చూసి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 17) : సిద్దిపేటలో ఈ నెల 19న గురువారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని హత్నూర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అజీజ్ పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్య అంశాలపై ముఖ్యమంత్రి కీలక సందేశాన్ని అందించనున్నారని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి నాయకత్వంలో ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, యువజన నాయకులు, మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
6
బుధవారం 18.11.2026
www.kalamjyothi.com



పోలీసు సిబ్బందికి స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్17) : తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2026 సందర్భంగా నిర్మల్, భైంసా డివిజన్ల పోలీస్ సిబ్బందికి స్పోర్ట్స్ కిట్లను డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2026లో వివిధ క్రీడా విభాగాల్లో పోలీస్ సిబ్బంది పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో బాసర జోన్ పరిధిలోని నిర్మల్, భైంసా డివిజన్ల పోలీస్ సిబ్బందికి నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. పోలీస్ సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించడంతో పాటు శారీరక దృఢత్వం, జట్టు సమన్వయాన్ని పెంపొందించేందుకు ఈ క్రీడలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,నిర్మల్ డీఎస్పీ పి.శ్రీనివాస్, భైంసా,నిర్మల్ డివిజన్ల పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దేశ గౌరవానికి భంగం కలిగించారు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి

విదేశీ ప్రతినిధిపై ఎస్పీకి ఫిర్యాదు

కలంజ్యోతి, భూపాలపల్లి (నవంబర్ 17) : హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో విదేశీ రాజకీయ ప్రతినిధి జియాకోమో ఫిలిబెక్ భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీకి బీజేపీ నాయకులు అధికారికంగా ఫిర్యాదు చేశారు.మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. భారత రాజ్యాంగ వ్యవస్థను, ప్రజాస్వామ్య ప్రక్రియలను ప్రశ్నిస్తూ దేశ గౌరవానికి భంగం కలిగించే విధంగా చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిర్వాహకుల పాత్రపైనా విచారణ జరపాలి..

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషీధర్ రెడ్డి మాట్లాడుతూ వరుస ఎన్నికల పరాజయాలతో తీవ్ర నిరాశలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీని మళ్లీ రాజకీయంగా నిలబెట్టేందుకు విదేశీయుల సహాయం కోరుతోందని విమర్శించారు. భారత గడ్డను విదేశీయుల రాజకీయ జోక్యానికి వేదికగా మార్చే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని స్పష్టం చేశారు. భారత్ సమ్మిట్‌లో ఒక విదేశీ రాజకీయ ప్రతినిధి భారత ప్రజాస్వామ్య వ్యవస్థను బహిరంగంగా ప్రశ్నిస్తుంటే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చప్పట్లు కొడుతూ ప్రోత్సహించడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలు ఇచ్చిన ప్రజాస్వామ్య తీర్పును కాంగ్రెస్ పార్టీ గౌరవించాలని హితవు పలికారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భారత్ సమ్మిట్ నిర్వాహకుల పాత్రపైనా లోతైన విచారణ జరపాలని ఎస్పీని కోరారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తాం..

భారతదేశం సార్వభౌమాధికారం కలిగిన ప్రజాస్వామ్య దేశమని, భారత రాజ్యాంగానికి, చట్టాలకు ఎవరూ అతీతులు కారని నిషీధర్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ గౌరవం, ప్రజాస్వామ్య పరిరక్షణ విషయంలో భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు కన్నం యుగదీశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరుకల గణపతి, రాష్ట్ర నాయకులు బట్టు రవి, దుప్పటి భద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, తాడికొండ రవి కిరణ్, వట్టెం తిరుపతి, ఊరటి మునీందర్, అర్బన్ అధ్యక్షులు గీస సంపత్, రూరల్ అధ్యక్షులు పులగుజ్జు రాజు, నాయకులు కొమురన్న, పోచయ్య, కుమార్, మనోహర్ రెడ్డి, రవీందర్, సుధాకర్, తిరుపతి రాజేష్, ఎర్ర రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

పూసల పుల్లయ్యకు రవి పటేల్ నివాళి

ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తా..

కలంజ్యోతి, భూపాలపల్లి (నవంబర్ 17) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం రూరల్ ఆజాంనగర్ గ్రామానికి చెందిన పూసల పుల్లయ్య మంగళవారం మరణించగా, ఆయన అంత్యక్రియల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలకు కష్టాల్లోనైనా, సంతోషాల్లోనైనా 24 గంటలు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆజాంనగర్ గ్రామానికి చెందిన టీఆర్పీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి రోడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు రూ. 1.22 కోట్ల నిధులు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీహరిరావు



నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎన్సీ రమేష్ బాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 17) : నిర్మల్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు తెలిపారు. ఈ మేరకు విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మణచాంద, నిర్మల్ రూరల్ మండలాల్లో మూడు కీలక అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం మొత్తం రూ.1.22 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందని మంగళవారం వెల్లడించారు. వడ్యాల్ గ్రామ సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్‌పై గతంలో కూలిపోయిన పంతెన పునర్నిర్మాణానికి రూ.66 లక్షలు, రాచాపూర్ కెనాల్‌పై సూపర్ పాసేజ్ బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ.39.40లక్షలు, నిర్మల్ రూరల్ మండలం ముజ్గి గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనుల చేపట్టేందుకు రూ.17.20 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు సాగునీటి అవసరాలకు ఉపశమనం కలగనుందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి



యాంటీబయాటిక్స్ వినియోగంపై అవగాహన ర్యాలీ

కలంజ్యోతి, వరంగల్ (నవంబర్ 17) : యాంటీ బయాటిక్స్‌ను వైద్యుల సూచనలు లేకుండా విచ్చలవిడిగా వినియోగించడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ రక్షణ సేన మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్ పేర్కొన్నారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా హనుమకొండ, వరంగల్‌లో నిర్వహించిన యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. యాంటీబయాటిక్స్‌ను అవసరం లేకుండా, వైద్యుల సలహాలు పాటించకుండా వినియోగించడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

వైద్యుల సూచనల మేరకే మందులు వాడాలి..

హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫార్మసీ కళాశాల నుంచి ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ కాళోజీ కళాక్షేత్రం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్‌తో పాటు వేలాది మంది ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు, వైద్య ఆరోగ్య రంగ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు యాంటీబయాటిక్స్‌ను స్వయంగా నిర్ణయించుకుని వాడకూడదని, వైద్యుల సూచనల మేరకే మందులు తీసుకోవాలని, మందుల వినియోగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అవగాహన కల్పించారు. యాంటీబయాటిక్స్‌పై నిర్లక్ష్యం భవిష్యత్తుకు ముప్పు కావొద్దని, సరైన అవగాహనతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమని ఈ ర్యాలీ ద్వారా సందేశం అందించారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
7
బుధవారం 18.11.2026
www.kalamjyothi.com



నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా

మేడారం అపర్ణ

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 17): నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మేడారం అపర్ణ ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. బీసీ వర్గానికి చెందిన అపర్ణ సీనియర్ మాత్రమే కాకుండా కౌన్సిలర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వెడ్మా బొజ్జు, నియోజకవర్గ ఇంచార్జి కె శ్రీహరి రావు, మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి లకు కృతజ్ఞతలు తెలిపారు.



అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

సంక్షేమ పథకాల పత్రాల పంపిణీ

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 17) : తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా నాగర్‌కర్నూల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని సాయి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.









మార్కెట్‌లో ఆక్రమణలతో అవస్థలు

- **15 అడుగుల మేర మున్సిపల్ స్థలం ఆక్రమణ పార్కింగ్**
- **సమస్యతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు**
- **కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి**


కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 17) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ఆక్రమణలు, ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన షాపుల విస్తరణతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లోని షాపులకు కేటాయించిన 10×10 అడుగుల స్థలానికి అదనంగా కొందరు వ్యాపారులు రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకొని మున్సిపాలిటీకి చెందిన స్థలాన్ని సుమారు 15 అడుగుల మేర ఆక్రమించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు షాపుల ముందు పెద్దపెద్ద ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయడంతో మార్కెట్ పరిసరాలు ఇరుకుగా మారుతున్నాయి.

పార్కింగ్ సమస్యతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు..

నిత్యం కూరగాయల కొనుగోళ్ల కోసం మార్కెట్‌కు వచ్చే పట్టణ ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో కార్లు, ద్విచక్ర వాహనాలను షాపుల ముందు రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. మరోవైపు మార్కెట్ పరిధిలో కొనసాగుతున్న మూడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద వాహనాల పార్కింగ్ విషయంలో తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు వాహనాలు నిలిపితే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ గొడవలకు దిగుతున్నారని వాపోతున్నారు.

కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి..

ఇంతకాలంగా మున్సిపల్ స్థలంలో ఆక్రమణలు కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి కూరగాయల మార్కెట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. సంబంధిత మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులతో విచారణ జరిపించి, ఆక్రమణలు నిజమని తేలితే తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ఆక్రమణలు తొలగించి పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

ఒకే తరహా పాత్రలకు పరిమితం చేయొద్దు

నటీనటులను ఒకే రకమైన పాత్రలకే పరిమితం చేయకుండా, విభిన్న పాత్రలకు అవకాశం ఇవ్వాలని దర్శకనిర్మాతలను నటి దేవయాని శర్మ కోరారు. సేవ్ ది టైగర్స్, సైతాన్ వెబ్ సిరీస్‌లతో గుర్తింపు పొందిన ఆమె ఇటీవల ఆదర్శ కుటుంబం సినిమాతో అలరించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఒకే తరహా రోల్స్ చేయడం వల్ల వచ్చే మూస ధోరణిని అధిగమించేందుకు ఇండస్ట్రీ విశాల దృక్పథంతో ఆలోచించాలని అన్నారు. తెలుగులో పలు ప్రాజెక్టులు చేసినా తనలోని నటిని తృప్తిపరిచే పాత్రలు రావడం లేదని, అందుకే కోలీవుడ్ వైపు అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం తమిళంలో ఆఫర్లు వస్తున్నా తనలోని కళాకారిణికి న్యాయం చేసే బలమైన పాత్ర కోసం ఎదురుచూస్తున్నానని దేవయాని తెలిపారు.





Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.